క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న పార్టీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్

కదిరి టౌన్: కదిరి మున్సిపల్ పరిధిలో 18వ వార్డుకు చెందిన బాబ్జాన్‌కు మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ. లక్ష చెక్కును వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ అందజేశారు. ఈ సందర్భంగా మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ఆరోగ్యానికి పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆపన్న హస్తం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

నల్లచెరువు: మండల కేంద్రంలోని ఎల్లమ్మ స్వామి వీధిలో నివాముండే వైఎస్సార్‌సీపీ కార్యకర్త గోరంట్ల బాబ్‌జాన్ (38) మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కదిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ గ్రామానికి విచ్చేసి బాబ్‌జాన్ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో మంగళవారం సర్పంచ్ శాంతాబాయ్ ఆధ్వర్యంలో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. డ్రైనేజీ లేక తామంతా ఇబ్బందులు పడుతున్నామని గతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన డ్రైనేజీ నిర్మాణం సత్వరం చేపట్టాలని సర్పంచ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి

తలుపుల: మండలంలోని వేపమానిపేట పంచాయతీ చదలవాండ్లపల్లి గ్రామంలో రామాలయాన్ని దేవదాయశాఖ సెక్షన్ 43 మేరకు రిజిస్టర్ చేస్తున్నట్లు మంగళవారం దేవాదాయ శాఖ అధికారి మల్లికార్జునరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సలహాలు, సూచనలు, అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లోపు జిల్లా దేవదాయ శాఖ కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.


ఆర్టీసీ ఉద్యోగుల గేట్ మీట్



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు

కదిరి అర్బన్: విశాఖపట్నం జిల్లా ప్రజారవాణా అధికారి నిరంకుశ వైఖరికి నిరసనగా మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు గేట్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ప్రజారవాణా అధికారి ఎన్‌ఎంయూ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. షెడ్యూల్, బదిలీల్లో మార్పులు చేసి సంస్థకు నష్టం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఎన్‌ఎంయూ నాయకులను అక్రమంగా పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడం సరికాదన్నారు. జీఓ 1-19 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. గేట్‌మీట్‌లో ఎన్‌ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిమోహన్, రామక్రిష్ణ, బైరిశెట్టి, అశ్వర్థామయ్య, గంగన్న, ఓబులేసు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు ఘన సన్మానం



ఎంపీడీఓను సన్మానిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: ప్రభుత్వ అధికారులకు బదిలీలు సర్వసాధారణమేనని జెడ్పీటీసీ కోటి సుధ, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బదిలీపై వెళ్లుతున్న ఎంపీడీఓ సాయిమనోహర్‌ను ప్రజా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీడీఓ సాయిమనోహర్ విధుల పట్ల అంకిత భావం, నిబద్ధతను కొనియాడారు. అనంతరం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీదేవి, ఈఓఆర్డీ దివాకర్, మండల ఇంజినీర్ రమణయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరనారప్ప, బండి నాగభూషణ, కప్పల నాగన్న, వెంగప్ప, ముసలప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిత

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- 'ఆడుదాం ఆంధ్ర' నియోజకవర్గ స్థాయి విజేతలకు అభినందన



ప్రతిభ కనబరచిన జట్లకు ట్రోఫీలను అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరచిన పలు జట్లకు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే కేతిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయి, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలలో టోర్నీలను నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. విద్యారంగ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. దీంతో పాటు పాఠశాల నుంచి కళాశాల స్థాయి దాకా విద్యార్థులు, యువకులలో క్రీడా ప్రతిభను గుర్తించి చేయూతనందిస్తున్నారన్నారు.

క్రీడా స్ఫూర్తితో సాగాలి..

నియోజకర్గ స్థాయిలో నిర్వహించిన పలు టోర్నీల్లో ప్రతిభ కనబరచిన జట్లకు ఎమ్మెల్యే కేతిరెడ్డి ట్రోఫీలను అందజేశారు. పురుషుల విభాగం క్రికెట్‌లో బత్తలపల్లి-2, బ్యాడ్మింటన్‌లో ధర్మవరం పట్టణం కేశవనగర్ జట్టు, వాలీబాల్‌లో ధర్మవరం ఎస్‌బీఐ కాలనీ జట్టు, కబడ్డీలో శివానగర్ ధర్మవరం అర్బన్ జట్టు, ఖోఖో టోర్నీలో బత్తలపల్లి వీ2జట్లు ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. మహిళల విభాగంలో క్రికెట్‌లో ధర్మవరం ఎస్‌బీఐ కాలనీ జట్టు, బ్యాడ్మింటన్‌లో ధర్మవరం దుర్గానగర్ జట్టు, వాలీబాల్‌లో ధర్మవరం అర్బన్ దుర్గానగర్ జట్టు, కబడ్డీలో ధర్మవరం మారుతీనగర్ జట్టు, ఖోఖోలో బత్తలపల్లి వీ2జట్లు ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. క్రీడాకారులందరికీ ఎమ్మెల్యే కేతిరెడ్డి అభినందనలు తెలియజేశారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, కమిషనర్ రామ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు కేతా లోకేష్, చెలిమి పెద్దన్న, కత్తె ఆదిలక్ష్మి, బడన్నపల్లి భాగ్యలక్ష్మి, కుమారస్వామి, కత్తె పెద్దన్న, చాంద్‌బాష, చిన్నూరు రమేష్, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఉదయ్ భాస్కర్, కిషన్‌రెడ్డి, తదితరులు

పుట్టపర్తి: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలలో నియోజకవర్గ స్థాయి విజేతలకు పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బహుమతులు ప్రదానం చేసినట్లు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఉదయ్ భాస్కర్ మంగళవారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి, యూత్ నాయకుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని పలువురు పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'లో సత్తా

నల్లమాడ: 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల్లో మండల క్రీడాకారులు సత్తా చాటారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. క్రికెట్, ఖోఖో క్రీడల్లో బాలుర జట్లు, కబడ్డీ పోటీలో బాలికల జట్టు నియోజకవర్గ స్థాయిలో విజయం సాధించినట్లు నల్లమాడ గ్రామ సచివాలయ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. వీరికి మంగళవారం పుట్టపర్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కుమారుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు.

రేపు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం



మాట్లాడుతున్న నాయకులు

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని శివాలయం వద్ద కమ్యూనిటీ హాలులో గురువారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి తెలిపారు. మండల నాయకులతో కలిసి మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించే కార్యక్రమానికి కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, సీఈసీ సభ్యులు పూలశ్రీనివాస్‌రెడ్డి, వజ్రభాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధశాఖల కన్వీనర్లు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సుబహాన్, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ నాగమునీశ్వరనాయుడు, ఉపసర్పంచ్ భాస్కర్‌రెడ్డి, నాయకులు షామీర్‌బాషా, తిరుమలనాయుడు, అస్లం, అల్లాబక్షు, శ్రీరాములు, చెన్నకేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యమే లక్ష్యం



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

తలుపుల: గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం సాగుతోందని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండలంలోని బట్రేపల్లి పంచాయతీలో రూ.1.31 కోట్లతో మామిళ్లవారిపల్లి, మూలపల్లి గ్రామాలకు వేసిన తారు రోడ్డు, సిమెంట్ రోడ్డును సర్పంచ్ వెంకటనారాయణ, కన్వీనర్ పయాజ్ అహమ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే సిద్దారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాతల కాలం నుంచి సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్న విషయాన్ని గతంలో గడప గడపకూ కార్యక్రమంలో గుర్తించామన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత జననేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫినాయక్, మాజీ సర్పంచ్ పురుషోత్తం రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ టోపీరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, శివారెడ్డి, ఆంజి, రాజగోపాల్‌రెడ్డి, మౌలా, హరి, వెంకటరమణ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



నూతన సీఐ పుల్లయ్య

కదిరి టౌన్: కదిరి పట్టణ నూతన సీఐగా కె. పుల్లయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్‌ఐలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను సీఐ మర్యాద పూర్వకంగా కలిశారు.

బదిలీ ఎస్‌ఐకు సన్మానం

గాండ్లపెంట: స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐగా పని చేస్తున్న వెంకటనారాయణ చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళుతుండడంతో స్టేషన్ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మంగళవారం పూలమాలలు వేసి దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ మండల నాయకులు పాల్గొన్నారు.

అందరికీ శాంతి పంచుదాం



శాంతి సందేశమిస్తున్న సిరాజుర్ రెహమాన్

కదిరి అర్బన్: అందరికీ శాంతిని పంచుదామని పీస్ మెసేజ్ ఫౌండర్ బ్రదర్ సిరాజుర్ రహిమాన్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ బాలుర కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం రాత్రి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో తొలి 3 మసీదులు మహమ్మద్ ప్రవక్త హయాంలోనే స్థాపించారన్నారు. మహ్మద్ ప్రవక్త నైతికత, నిరాడంబరత, అల్లాహ్‌పై విశ్వాసం, తన సహచరులతో కలిగి ఉన్న సత్సంబంధాలతో ఇస్లాం వ్యాపించిందన్నారు. ఇస్లాం శాంతిని కోరుకుంటుందన్నారు. సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మగ్బుల్ అహ్మద్‌తో పాటు ముస్లింలు, హిందువులు పాల్గొన్నారు.

దోమకాటుకు గురికావొద్దు

తాడిమర్రి: దోమకాటుకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరామ్ నాయక్ గ్రామస్తులకు సూచించారు. మండలంలోని నార్శింపల్లిలో సోమవారం రాత్రి, నిడిగల్లు గ్రామంలో మంగళవారం రాత్రి ఆయన వైద్య సిబ్బందితో కలిసి ఫైలేరియా (బోదవ్యాధి) సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ క్యూలెక్స్ అనే ఆడదోమ కుట్టడంతో బోదకాల వ్యాధి వచ్చే ప్రమాదం ఉందన్నారు. ముందే గుర్తిస్తే నివారించవచ్చన్నారు. సేకరించిన రక్త నమూనాలను అనంతపురంలోని సర్వజన ఆసుపత్రికి పంపి పరీక్షలు చేయిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ రామ్‌కుమార్, ఎంపీహెచ్‌ఏలు జానకీరామ్, హర్షవర్ధన్‌రెడ్డి, ఏఎన్ఎంలు కృష్ణమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

కనగానపల్లి: మండలంలోని ముక్తాపురం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ విద్యుత్ సరఫరా ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులోని ఆయిల్, వైరు ఎత్తుకెళ్లారు. గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద ఏర్పాటు చేసిన 25 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. తర్వాత అందులోని సుమారు 100 లీటర్ల డీపీ ఆయిల్, కాపర్ వైరు ఎత్తుకెళ్లారని రైతులు చెన్నేకేశవులు, చంద్రశేఖర్, రాజా, రామచంద్ర వాపోయారు. దీనిపై కనగానపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి

రామగిరి: రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని ఆ పార్టీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల వ్యాప్తంగా పంచాయతీలు పేరూరు, గంతిమర్రి, రామగిరి, పెద్దకొండాపురం, ఎంపీపల్లి, మాదాపురం, నసనకోట, పోలేపల్లి, కుంటిమద్ది గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో ప్రజలకు ఏమాత్రం న్యాయం జరగలేదని, ప్రస్తుతం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండడంతో నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని చెరువులకు హంద్రీ నీవా నీటిని తీసుకొచ్చామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి కుల, మత, ప్రాంతాలకతీతంగా అందరికీ అందేలా వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ క్రా హనుమంతరెడ్డి, సర్పంచులు మీనుగ నాగరాజు, రాజేష్, నరేంద్ర, ఓబిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, రామ్మూర్తి, సిద్ధన్న, నాయకులు పాల్గొన్నారు.

కుష్టుపై అవగాహన అవసరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జ్యోత్స్న



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కుష్టు నియంత్రణ అధికారి తిప్పయ్య

పుట్టపర్తి అర్బన్: కుష్టు వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ జ్యోత్స్న పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ కుష్టువ్యాధిగ్రస్తులు తుమ్మినా, దగ్గినా వెలువడే తుంపర్ల ద్వారా వ్యాపిస్తుందన్నారు. చర్మంపై రాగి రంగు మచ్చలు, పాలిపోయినట్లు ఉన్న మచ్చలు, స్పర్శ లేని మచ్చలు, శరీరంపై బుడిపెలు ఉండడం, నరాలు ఉబ్బినట్టుగా ఉండి నొప్పి అనిపించడం మొదలైన లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుల వద్ద చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నగేష్, సూపర్‌వైజర్లు గోపి, చంద్రకళ, టీచర్లు భక్తవత్సల, వెంకటరాముడు, సిబ్బంది అపర్ణ, ప్రమీళ, మంజుల, నాగజ్యోతి, అంగన్‌వాడీలు అరుణ, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించండి

బత్తలపల్లి: కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కుష్టు, క్షయ, ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ తిప్పయ్య సూచించారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 13వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాల్ని చేపట్టాలని సూచించారు. కుష్టు వ్యాధి నిర్ధారణ జరిగితే బహుళ ఔషధ (ఎండిటీ) చికిత్స ప్రారంభించాలని తెలియజేశారు. అంతకు ముందు మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రామకృష్ణ, సీహెచ్‌ఓ రాజశేఖర్, పర్యవేక్షకులు చంద్రశేఖర్‌రెడ్డి, గౌరమ్మ, ఫార్మసిస్ట్ సరస్వతి, స్టాఫ్‌నర్స్ మంజుల, ఏఎన్‌ఎంలు రాధ, వాణి, ఎంపీహెచ్‌ఏలు మారుతి, రవి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలోకి చేరిన వారితో సమన్వయకర్త మక్బూల్

కదిరి టౌన్: కదిరి పట్టణంలోని మశానం పేట, తదితర వార్డుల్లో టీడీపీకి చెందిన 30 కుటుంబాలు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తుండడంతో ప్రతి ఒక్కరూ ఆదరిస్తున్నారని తెలిపారు. ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు.

ఎంవీఐ కార్యాలయ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి, అధికారులు

ధర్మవరం: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఎంవీఐ (మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్) కార్యాలయానికి సంబంధించి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, డీటీఓ సత్యసాయిరెడ్డి, ఎంవీఐ వరప్రసాద్‌రావులు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. మార్కెట్ యార్డులో ఎంవీఐ కార్యాలయాన్ని తాత్కాలికంగా ప్రారంభించేందుకు వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరం సబ్‌డివిజన్‌లో ప్రజల సౌకర్యార్థం పట్టణంలో ఎంవీఐ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేలా ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. అందుకు మార్కెట్‌యార్డులో కార్యాలయ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే సోదరుడు వెంకటకృష్ణారెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిని ఆరా తీస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ధర్మవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని డీఎల్‌ఆర్ కాలనీ, విలేకర్ల కాలనీల్లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. పథకాల కోసం దళారులను ఆశ్రయించకుండా సంక్షేమ పథకాల్లో పారదర్శకత కోసం గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారన్నారు. వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నారని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బాలిరెడ్డి, వడ్డె బాలాజి, దేవరకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు శుభాకాంక్షలు



కమిషనర్ రామ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న చైర్‌పర్సన్ లక్ష్మి

ధర్మవరం రూరల్: రానున్న ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేశారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ధర్మవరంలో పని చేస్తున్న బండి శేషన్నను తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఈయన స్థానంలో తూర్పుగోదావరి జిల్లా మండపేట మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రామ్‌కుమార్‌ను నియమించారు. మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపాలిటీని అభివృద్ధి బాటలో నడిపేందుకు అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళదామని ఆయన అన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాల పరిశీలన

ముదిగుబ్బ: మండల పరిధిలోని దొరిగిల్లు, గుంజేపల్లి పొలాల్లో మంగళవారం కంది పంటకోత ప్రయోగాలను చేపట్టారు. జిల్లా అర్థ గణాంక శాఖ అధికారి విజయ్‌కుమార్ పరిశీలించారు. రైతు ఓబులమ్మ పొలంలో కంది పంటలో పంట కోతలు చేపట్టగా 690 గ్రాముల దిగుబడి వచ్చింది. ఎకరాకు 34.5 కేజీల దిగుబడి వచ్చినట్లు ఉప గణాంక అధికారి శ్రీనివాసనాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మీనరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం

పుట్టపర్తి: సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం పేద, బడుగు వర్గాలకు వరంగా మారిందని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బుక్కపట్నం మండలం గోకవారిపల్లి గ్రామంలో సర్పంచ్ గోవిందరెడ్డితో కలిసి 'జగనన్న ఆరోగ్య సురక్ష-2' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. పేదల అభ్యున్నతికి తోడ్పాటునిస్తూ, వారి ఆరోగ్యానికి భరోసానిస్తున్నారన్నారు. అనంతరం సర్పంచ్‌తో కలసి బుక్‌లెట్లు పంపిణీ చేశారు.

సంక్షిప్త సమాచారం

అత్తపై కోడలి దాడి

తలుపుల: అత్తపై కోడలు దాడి చేసిన ఘటన మండలంలోని మూలపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. మూలపల్లికి చెందిన మండెం రాజయ్య భార్య లక్ష్మీదేవి, ఆమె కోడలు కళావతి భూమి విషయంలో సోమవారం రాత్రి గొడవ పడ్డారు. ఈ క్రమంలోనే కళావతి తన అత్త లక్ష్మీదేవిని తలపై కొట్టడంతో గాయాలయ్యాయి. లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రవికాంత్ తెలిపారు.

త్రోబాల్ పోటీల్లో ప్రతిభ

ధర్మవరం రూరల్: బత్తలపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో గత రెండు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో ధర్మవరం పట్టణంలోని యశోదా పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీనియర్ బాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థినులు హేమ, వర్షిత, 8వ తరగతి చదువుతున్న మిథిల, ధాత్రి ఉత్తమ ఆటతీరు ప్రదర్శించారు. సీనియర్ బాలుర విభాగంలో తన్మయి, శ్రీచరణ్, కార్తీక్ తదితరులు తృతీయ స్థానం సాధించారు. వీరిని పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూప్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు మంగళవారం అభినందించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులంతా తప్పక హాజరు కావాలని సూచించారు.

ఎంవీఐకి సన్మానం

ధర్మవరం: కదిరి ఎంవీఐ (మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్) డీఎస్ఎం వరప్రసాద్ రావును పట్టణంలోని డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు దుశ్శాలువాతో మంగళవారం సత్కరించారు. రిపబ్లిక్ డే రోజున ఎంవీఐ అవార్డును అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక బిస్మిల్లా డ్రైవింగ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను సత్కరించారు. డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు ఆయూబ్‌ఖాన్, వీరా, శివ, విజయ్, ఫణికుమార్, ఉమర్, ఫరీద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

ముదిగుబ్బ: మండల పరిధిలోని భూదనాంపల్లి గ్రామంలో మంగళవారం భూదలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వెండి ఆభరణాలు, పుష్పాలతో అలంకరించి విశేష పూజలను చేశారు. ఈ సందర్భంగా ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, సర్పంచ్ వెంగల్ రెడ్డి, ఎంపీటీసీ శివారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.